పింఛను డబ్బులు ఆపేశారయ్యా!

- ఘొల్లుమంటున్న బాధితులు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో..!
- రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సతమతం



శావల్యాపురం: పింఛను డబ్బులు నిలిపివేయడంపై పలువురు అవ్వా-తాతలు ఘొల్లుమంటున్నారు. కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో అర్హులైన లబ్ధిదారుల పింఛన్లు అధికారుల ప్రమేయంతో నిలుపుదల చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగనన్న హయాంలో పార్టీలకతీతంగా నెలానెలా వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ పింఛన్లు అందించే వారని ఇవాళ ఆ పరిస్థితికి విరుద్ధంగా ఉందని వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రతినెలా ఫస్టు తారీకునాడు ఇచ్చే పింఛను డబ్బులపై ఆధారపడి బతుకుతున్న వారిని పార్టీల పేరుతో నిలిపివేయడంతో చేసేది లేక మందులు, ఇతరత్రా అవసరాలకు వేరొకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మే నెలలో మండలంలోని పోట్లూరు, కొత్తలూరు, పిచికలపాలెం గ్రామాల్లో పింఛన్లు నిలుపుదల చేశారు. ఇదిలా ఉంటే నేతల సిఫార్సులకు అధికారులకు సతమతమవుతున్నారు. పింఛను మంజూరు ఒక విధి విధానమంటూ ఉంది. దాన్ని బేఖాతరు చేస్తూ తాము చెప్పిందే.. చేయాలని నేతలు హుకుం జారీ చేస్తుండటంతో అధికార యంత్రాంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి.

39 మందికి నిలుపుదల!

శావల్యాపురం మండలంలో 5777 వివిధ రకాల పింఛనుదారులు ఉండగా ఈనెలలో మండలంలోని కొత్తలూరు-08, పోట్లూరు-22, పిచికలపాలెం-09 పింఛన్లు నిలుపుదల చేశారు. మండలంలోని పోట్లూరు గ్రామంలో గత నెలలో జరిగిన తిరునాళ్ల వేడుకల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభకు చందా ఇచ్చారన్న నెపంతో కొన్ని పింఛన్లు నిలుపుదల చేశారని పింఛనుదారులు వాపోతున్నారు. జిల్లా కలెక్టరు స్పందించి అర్హులైన లబ్ధిదారులకు సత్వరమే పింఛను సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పింఛను ఇవ్వట్లేదు



2015 నుంచి వృద్ధాప్య పింఛను వస్తుంది. మందులకు వాటిని వాడుకునే దాన్ని. కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల నెపంతో కావాలనే నిలిపివేశారు. జిల్లా అధికారులు స్పందించి నిలిపి వేసిన పింఛను వెంటనే మంజూరు చేయాలి.

–చింతా లక్ష్మమ్మ, పోట్లూరు

పింఛను డబ్బులే ఆధారం!



రోడ్డు ప్రమాదంలో కాళ్ల దగ్గర తొంటి భాగంలో విరిగింది. మూడుసార్లు ఆపరేషన్లు చేసిన నాకు ఇక పనులు చేసుకునే పరిస్థితి లేదు. నెలవారి వచ్చే రూ.6 వేల పింఛనే ఆధారం. అదే నిలుపుదల చేశారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందయ్యా. స్పందించి పింఛను వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–అమృతపూడి అలెగ్జాండర్, పిచికలపాలెం

వర్షపు ధాటికి కత్తవ వాగు అతలాకుతలం

- పొంగి రోడ్డుపైకి చేరిన చెత్తాచెదారం
- ఆక్రమణలు తొలగించాలంటున్న ప్రజాసంఘాల నాయకులు



ఆర్డీవో కార్యాలయ ఆవరణలో జోరుగా కురుస్తున్న వర్షం

నరసరావుపేట: పట్టణంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ వర్షంతో అవుల సత్రం పక్కనే ఉన్న కత్తవ చెరువుకు దారి తీసే వాగు పొంగి చుట్టుపక్కల ప్రవహించి రహదారిపైకి వచ్చేక్రమంలో అధికారులు సకాలంలో పూడిక తీయడంతో ప్రమాదమే తప్పింది. అదే భారీ వర్షం పడి అధికారులు గమనించకపోతే ఆ ప్రాంత ఇళ్లల్లోకి నీళ్లు రావడం, ప్రజలు జనజీవనం అతలాకుతలమవడం జరిగిఉండేది. భారీ వర్షం కురిస్తే పట్టణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నరసరావుపేటతో ఉంది. 2016 సెప్టెంబరు 21వ తేదీ అర్ధరాత్రి ఒకేసారి 22 సెం.మీ వర్షం కురిసింది. దీంతో నకరికల్లు పల్లపు ప్రాంతాల నుంచి పట్టణం మీదకు నీరు భారీగా ప్రవహించటంతో పల్నాడురోడ్డు, పెద్దచెరువు, బరంపేట, గుంటూరు రోడ్డులలో ఐదారు అడుగుల ఎత్తున చేరింది. ఆ అనుభవాన్ని చూసిన పట్టణ ప్రజలు నిత్యం డ్రెయిన్‌లు ఆక్రమణకు గురి కాకుండా చూడాలంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన చిన్న వర్షానికే పలు ప్రాంతాల్లో నీళ్లు రోడ్లపై ప్రవహించాయి. కాలువల్లో నిర్మించిన అక్రమ కట్టడాలు, చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన పూడిక సకాలంలో తొలగించకపోతే అవి గోనెలకు అడ్డుపడి నివాస ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం పొంచిఉంది. కాగా, సత్తెనపల్లిరోడ్డులో జరిగిన పరిస్థితిపై దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు శుక్రవారం పరిశీలించి తాము కత్తవ వాగులో కొందరు చేస్తున్న ఆక్రమణలను తొలగించాలని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, కలెక్టర్ సైతం సంబంధిత మైనర్ ఇరిగేషన్‌శాఖ, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం అందరూ బాధ్యతగా కత్వా చెరువు వాగు ఆక్రమణలను తొలగించాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కె.రవికుమార్

నరసరావుపేట రూరల్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఏరియా వైద్యశాల వైద్యుడు డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, ప్రమాదకర ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతుందని తెలిపారు. దీనికి అలవాటు పడిన యువత అనారోగ్యాలకు గురికావడంతో పాటు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల ప్రభావం వలన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి దెబ్బదింటుందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి విలువైన జీవతాన్ని కోల్పోతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎస్.అనూష, నాగజ్యోతి, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో మానసిక, శారీరక సమస్యలు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం, ఉప్పరపాలెం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో నిర్మలా రాని ముఖ్య అతిథిగా హాజరై పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్యవివాహాల కారణంగా కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. మత్స్య,శిశు మరణాలను తగ్గించేందుకు బాల్యవివాహాలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వలన బాలికల శారీరక, మానసిక పరిస్థితులపై దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ నిర్మల రాణి, సూపర్‌వైజర్ ఎం. జోజమ్మ, ఏఎన్ఎం ఏ. జోజి మేరీ, అంగన్వాడీ కార్యకర్తలు షేక్ జరీనా, వివి సుబ్బాయమ్మ, వి.ఆర్. కోటేశ్వరి, ఆశ వర్కర్లు షేక్ మస్తాన్‌బి పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తే సహించం

- ఏపీయూడబ్ల్యూజే స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ భక్తవత్సలరావు
- పలుచోట్ల జర్నలిస్టుల నిరసన



డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చిలకలూరిపేట: ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తారా... పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్పించే ఎలాంటి చర్యలను సహించేది లేదంటూ ఏపీయూడబ్ల్యూజే స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పుల్లగూర భక్తవత్సలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలోకి పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు చేయడాన్ని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే అనుబంధ చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇప్పటివరకు ఒక పత్రిక ఎడిటర్ స్థాయి వ్యక్తి ఇంట్లో పోలీసులు అనుమతులు లేకుండా, ఎలాంటి వారంట్ లేకుండా సోదాలు నిర్వహించిన సంఘటన లేదన్నారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించటంతో పాటు, పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు తప్పు చేస్తే అవి ఎత్తిచూపే బాధ్యత మీడియాపై ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఏసీహెచ్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు షేక్ జిలాని, చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నలదాసు శేషగిరి, షేక్ అబ్దుల్ సత్తార్, షేక్ అల్లాబక్షు, కాట్రు శ్రీనివాసరావు, షేక్ హసన్‌వలి, ఆలపాటి ఆంజనేయులు, దార్ల బుజ్జిబాబు, కె.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కాటాలను ప్రతి ఏడాది పరీక్షకు పంపాలి

నరసరావుపేట: వినియోగదారులు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసినప్పుడు వారికి ఖచ్చితమైన తూకం ప్రకారం విక్రయించాలని, అందుకు వాడే కాటాలను ప్రతి ఏడాది లీగల్ మెట్రాలజీ స్టాంపింగ్‌కు పంపించి తప్పనిసరిగా రసీదు పొందాలని పల్నాడు జిల్లా ఇన్‌స్పెక్టర్ డి.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని డీమార్టులో వినియోగదారులు, వర్తకులకు లీగల్ మెట్రోలజీ అధికారులు అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సుబ్బయ్యతోట, బోస్‌రోడ్డు, కేబీరోడ్డు, మెయిన్ బజార్, కళామందిర్‌సెంటర్, పండరీపురం ఒకటో లైన్ నుంచి 8వ లైన్ వరకు, ఎన్ఆర్ టీ సెంటర్ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే చిలకలూరిపేట మండల పరిధిలోని గంగన్నపాలెం, కట్టుబడివారిపాలెం, యడవల్లి, కోమటినేనివారిపాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, మురికిపూడి గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసరావుపేటటౌన్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చేజర్ల రాంబొట్లు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధి లోగల అన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లను మరమత్తులు చేయబడును అన్నారు. ఉదయం 8గం.నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

నాదెండ్ల: మండలంలో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఏఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. సాతులూరు, నాదెండ్ల, గణపవరం, ఇర్లపాడు, ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రొంపిచర్ల: మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఈ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్ళ 220 కె.వి.సబ్ స్టేషన్ లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అదే విధంగా మండలంలో రొంపిచర్ల, వి. రెడ్డిపాలెం, సుబ్బయ్య పాలెం, బుచ్చిపాపన్నపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో గల 33, 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని అన్నారు. త్రీ ఫేస్ విద్యుత్ శనివారం ఉదయం ఒంటి గంట నుంచి 9 గంటల వరకు ఇవ్వబడుతుందన్నారు. కావున మండలంలో రైతులు, వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి, షిఫ్ట్ ఆపరేటర్లకు సహకరించాలని ఆయన కోరారు.

బాలికలు విద్యలో రాణించాలి

శావల్యాపురం: బాలికలు విద్యలో రాణిస్తే సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని పీడీ ఉమాదేవి అన్నారు. మండలంలోని శావల్యాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలో కిషోర వికాసం కార్యక్రమంపై జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ బాలికా వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పరిస్థితులు ఎలాంటి వైనా బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవన్నారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు భారంగా భావించరాదన్నారు. మీ చుట్టు ప్రక్కల అలాంటి వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సచివాలయ మహిళా పోలీసుకుగానీ, ఐసీడీయస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో అనూరాధ, సూపర్‌వైజర్ శ్రీలత, ఎఎన్ఎం నాగలక్ష్మి ఉన్నారు.

ఐటీఐ సీట్లు భర్తీకి చర్యలు తీసుకోవాలి

నాదెండ్ల: రెండేళ్ళక్రితం నీతి అయోగ్ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా పదిహేను వేల ఐటీఐ సంస్థల్లో సగానికి పైగా సీట్లు భర్తీకావటం లేదని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు తెలిపారు. కళాశాలల్లో 50 శాతం పైగా బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటం ఒక కారణమన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

నరసరావుపేట: కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్నీ రంగాల కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదంకై వివిధ సంఘాలతో ఏర్పాటు చేసిన సదస్సుకు మెటిల్దాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమ్మె పుస్తకాన్ని ఆవిష్కరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నూజెండ్ల: మండలంలోని కొత్త ఉప్పలపాడు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని టాటా ఏస్ వాహనం ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త కొత్తపాలెం గ్రామానికి చెందిన కుంటా వెంకటరెడ్డి (62) ద్విచక్ర వాహనంపై వినుకొండ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొంది. దీంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్సై బీవీ కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

నరసరావుపేటలో పోలీస్ తనిఖీలు



నరసరావుపేటటౌన్: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పల్నాడు జిల్లా పోలీసులు అప్రమత్తం అయ్యారు. బుధవారం అర్ధరాత్రి నుంచే జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని రద్దీ ప్రాంతాలపై దృష్టి సారించారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆధ్వర్యంలో డీమార్ట్‌ను పోలీస్ జాగిలాలతో వెళ్లి పరిశీలించారు. టూటౌన్ పరిధిలోని కాసు సెంట్రల్ మాల్‌ను సీఐ హైమారావు పరిశీలించారు. అదే విధంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పరిశీలించి అక్కడ అనుమానితులను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలన్నారు.

మైనర్ కాలువకు మరమ్మతులు చేయించాలి

వినుకొండ: బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి చివరి వరకు ఉన్న ఎస్ఎస్‌పీ మైనర్ ఇరిగేషన్ కాలువను వెంటనే మరమ్మతులు చేయించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, కలెక్టర్ పి.అరుణబాబును రైతులు కోరారు. వినుకొండలో జరిగిన అధికారుల సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను, ప్రజాప్రతినిధులు రైతులు పగడాల చిన్నకోటిరెడ్డి, యాదాల శంకరరావు, కంటరంగారావు, గాయం చంద్రారెడ్డిలుకలిసి వినతిపత్రం అందజేశారు.

ఏఎంరెడ్డి అధ్యాపకుడికి డాక్టరేట్



నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు ఎం.అనంద్‌కుమార్ డాక్టరేట్ డిగ్రీ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున్ శుక్రవారం తెలిపారు. చెన్నైకి చెందిన సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రైవసి ఆన్ బిగ్ డేటా అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని సాధించినట్టు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



బొల్లాపల్లి: రక్తహీనత సమస్యలు రాకుండా ఉండేందుకు కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని కనుమలచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణా కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులు, బాలవివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మ రక్షణ, నైపుణ్య ఉపాధి, లింగ వివక్షత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తనారు నాగమల్లేశ్వరి, ఆశ వర్కర్ నిర్మల, గర్భిణులు, బాలింతలు, బాలికలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేయాలి

- బండ్లమోటు సీసపు గనిని పునఃప్రారంభించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాదరావు

బొల్లాపల్లి: వరికపూడిశెల ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి బొల్లాపల్లి మండలంతో సహా నాలుగు మండలాల ప్రజలకు తాగునీరు, సాగునీరు వెంటనే కల్పించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో మండల కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఐ 5వ మండల మహాసభ నిర్వహించారు. ముందుగా ఎర్రజెండాను ఇరగబోయిన కోటేశ్వరరావు ఆవిష్కరించారు. మహాసభలో మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వరికపూడిశెలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బండ్లమోటు సీసపు గనిని పునఃప్రారంభించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. తల్లికి వందనం, ఇళ్ల స్థలాలు, ఇల్లు లేని వారికి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని, పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బండ్లమోటులో సీసపు గనిని పునఃప్రారంభించాలని, వరికపూడిశెల పనులు ప్రారంభించాలని, తాగునీటి ఎద్దడిని తీర్చాలని, తాగు, సాగునీటి కోసం శాశ్వత పథకాలను వెంటనే ప్రారంభించాలని తీర్మానాలను చేశారు. అనంతరం 9 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ కార్యద ర్శి బూదాల శ్రీనివాసరావు, సైదావలి, షేక్ కొండ్రముట్ల చిన్న సుభాని, కొప్పరపు మల్లికార్జునరావు, కండే నాసరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న జడ్జి ఎం. మహతి

వినుకొండ: వినుకొండ న్యాయవాద సంఘం వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం (మాక్స్ విజన్ డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి నరసరావుపేట వారి సౌజన్యంతో) కోనెక్ డయాగ్నోసిస్ వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ ఆరోగ్య పరీక్షా కేంద్రంను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం. మహతి ప్రారంభించారు. ఈ కంటి వైద్యం శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి రాయితీపై కళ్లజోళ్లు, మెడిసిన్స్ ఇవ్వడం జరుగుతుందని, ఉచిత డయాబెటిక్ ఆరోగ్య పరీక్షా కేంద్రంలో రక్త పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలియజేశారు. న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు అందరికీ కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అని న్యాయవాద సంఘ సభ్యులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ పఠాన్ గౌస్, మొహిద్దీన్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ నీలం శేఖర్ బాబు, ట్రెజరర్ వరగాని శివశంకర బాబు, జి. వెంకటేశ్వర్లు, కె.చెన్న కేశవరెడ్డి, కె.ఎస్.ఎన్.వి. నాయుడు, ఎన్.రమణా రావు, వి.అమర్ బాబు, డి.నాగరాజు, ఎం. మల్లికార్జున్ రెడ్డి, ఎస్.రామాంజనేయరెడ్డి సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధికారులతో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ: పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్‌లో వినుకొండ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో శుక్రవారం నియోజకవర్గ సమీక్ష సమావేశం ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారుల పనితీరుపై సమీక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి, పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారాలు, అభివృద్ధి ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నియోజకవర్గ, మండలాల అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నేతలు పిలుపు నిచ్చారు. అరండల్‌పేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్మిక, రైతు సంఘాలతో సార్వత్రిక సమ్మె సన్నాహక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమ్మెను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఐక్య కార్యాచరణను రూపొందించారు. వివిధ కార్మిక సంఘాలు వారి వారి పరిధిలో సమావేశాలు నిర్వహించటంతో పాటు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మైక్, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే 17వతేదీన మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరచనున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సిఐటీయూ జిల్లా కోశాధికారి శివకుమారి, ఆయా కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి మహారాణాప్రతాప్‌సింగ్



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నరసరావుపేట: స్థానిక మాహాత్మాగాంధీ క్లాత్‌మార్కెట్‌లోని శ్రీనివాస్ ఇంజినీర్స్ కార్యాలయంలో శుక్రవారం శ్రీ మాహారాణా ప్రతాప్‌సింగ్ 486వ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రతాప్‌సింగ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. బొందిలి శ్రీనివాససింగ్ మాట్లాడుతూ భారత జాతి గర్వించతగ్గ మహావ్యక్తి రాణా ప్రతాప్‌సింగ్ అన్నారు.

ఇప్పటి బావి భారత పౌరులు వారిని ఆద ర్శంగా తీసుకుని వారి ధైర్యసాహసాలు గుర్తుంచుకోవాలని కోరారు. అలాగే ఇప్పుడు జరుగుతున్న సింధూర్ యుద్ధం విజయవంతం కావాలని, సైనికులు వారిని ఆదర్శంగా తీసుకొని మనోధైర్యం కోల్పోకుండా యుద్ధం చెయ్యాలని సూచించారు. బత్తుల మురళి, గట్టుపలి సత్యనారాయణ, రెబ్బాల శ్రీనివాస్, నాగమల్ సింగ్, బొందిలి సితారాంసింగ్ పాల్గొన్నారు.

పొట్టేలును చంపితిన్న వీధి కుక్కలు!

నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కుక్కల నివారణకు స్థానిక అధికారులతో పాటూ జిల్లా అధికారులు సైతం స్పందించకపోవటంతో ఎంతోమంది కుక్కకాటుకు గురికావటంతో పాటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన రైతు వడ్లమూడి శ్రీకాంత్ తన గేదెల పాకలో పొట్టేలును ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు పాకలోకి జొరబడి పొట్టేలుపై దాడిచేసి చంపేశాయి. పొట్టేలు కళేబరాన్ని ఈడ్చుకెళ్ళి తిన్నాయి. ఉదయం గమనించిన బాధితుడు లబోదిబోమన్నాడు. దీని విలువ రూ.10 వేల వరకూ ఉంటుందని చెప్పాడు. రెండు రోజుల క్రితం గణపవరం శాంతినగర్‌లోని వీధుల్లో కుక్కలు దాడిచేయటంతో పలువురు గాయాలపాలయ్యారు. ఏడాది క్రితం నుంచి పాకల్లో ఉన్న సుమారు పది లేగదూడలు, ఇరవై వరకూ మేక పిల్లలపై దాడి చేసి చంపేశాయి. వీధికుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.